సాక్షి పెద్దపల్లి

మంగళవారం । 18 । ఏప్రిల్ । 2023



పోలీసులకు పండుగంటే క్రీడలే..

పోలీసులకు నిజమైన పండుగ క్రీడలేనని రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి తెలిపారు. కమిషనరేట్ పరిధిలో పోలీసు క్రీడలను ప్రారంభించారు. 8లో▸



పత్తి క్వింటాల్‌కు రూ.7,711

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మార్కెట్‌లో పత్తి క్వింటాల్‌కు సోమవారం రూ.7,711 పలికింది. కనిష్టంగా రూ.6,888, సరాసరి రూ.7,555గా నమోదైందని మార్కెట్ కమిటీ ప్రత్యేకశ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు.

గరిష్టం/కనిష్టం
44.6/27.0

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండవేడిమి అధికమవుతుంది. ఉక్కపోత మరింత పెరుగుతుంది.

హింస ద్వారా పరధర్మాన్ని అణచడం రక్తపాతం కంటే అత్యంత తీవ్రమైనది.
– మహమ్మద్ ప్రవక్త

	ఇఫ్తార్		సహర్
మంగళ	6:36	బుధ	4:30

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

ధర్మారంలో ఘనంగా గంగా బోనాలు



బోనాలతో వస్తున్న భక్తులు

ధర్మారం: మండల కేంద్రంలో యాదవసంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీరయ్య పట్నాల ఉత్సవాల్లో భాగంగా సోమవారం గంగా బోనాలు నిర్వహించారు. డప్పు చప్పుల మధ్య ఇంటికో బోనం చొప్పున భక్తులు ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సొసైటీ ఫోరం కన్వీనర్ జంగ మహేందర్‌యాదవ్, సంఘం అధ్యక్షుడు తుమ్మల కోమురయ్య, ఎంపీటీసీ తుమ్మల రాంబాబు, యాదవ యూత్ అధ్యక్షుడు సులిగేటి శేఖర్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నియంత్రణపై అవగాహన




శంకర్‌గంజ్‌లో అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రంలోని శంకర్‌గంజ్‌లో అపార్ట్‌మెంట్లలో నివాసముంటున్న ప్రజలకు అగ్నిప్రమాదాల నివారణకు అనుసరించాల్సిన పద్ధతులపై అగ్నిమాపక శాఖ అధికారి దేవనంది శ్రీనివాస్ సోమవారం అవగాహన కల్పించారు. అకస్మాత్తుగా అగ్నిప్రమాదం సంభవిస్తే మంటలను ఆర్పేందుకు స్థానికంగా ఉన్న పరికరాలను ఎలా వినియోగించాలి..? మంటలను ఎలా అదుపుచేయాలి..? అనే విషయాలపై వివరించారు. అనంతరం పోస్టర్లు అతికించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ఫైర్‌ఆఫీసు సిబ్బంది సిరాజుద్దీన్, చంద్రయ్య, శ్రావణ్‌కుమార్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరిఖనిలో..

కోల్‌సిటీ: అగ్ని ప్రమాదాలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని గోదావరిఖని స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఆర్.సత్యనారాయణ కోరారు. వారోత్సవాల్లో భాగంగా శారదానగర్‌లోని అపార్ట్‌మెంట్లలో మహిళలకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఫైర్ సిబ్బంది పి.సత్తయ్య, జి.సురేష్ బాబు, ఎండీ.శౌకత్‌అలీ, ఏ.రాజు, అశోక్, పి.వెంకటి పాల్గొన్నారు.

ఎల్లంపల్లిలో తగ్గిన నీటిమట్టం



ప్రాజెక్టులో తగ్గిన నీటిమట్టం

రామగుండం: ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటిమట్టం పడిపోయింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 148 మీటర్లఎత్తులో 20.175 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 144.10 మీటర్ల ఎత్తులో 10.314 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు. పార్వతీ పంపుహౌజ్ నుంచి 1,512 క్యూసెక్కులు, ఇతర ప్రాంతాల నుంచి 467 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తుండగా.. ఎన్టీపీసీకి 121 క్యూసెక్కులు, హైదరాబాద్ మెట్రోకు 331, నంది పంపుహౌజ్‌కు 2,953, గూడెం పంపుహౌజ్‌కు 290, మిషన్ భగీరథ (రామగుండం, పెద్దపల్లి నియోజకవర్గాలకు) 58, మంచిర్యాలకు 23 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉందని తెలిపారు.

ముస్లింలకు దుస్తులు పంపిణీ

మంథని: రంజాన్ మాసం సందర్భంగా సోమవారం ముత్తారం ఎంపీడీవో కార్యాలయంలో ముస్లింలకు దుస్తులు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నివర్గాలకు సముచిత స్థానం కల్పిస్తున్నారని ప్రజాప్రతినిధులు అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరందన్, ఎంపీపీ జక్కుల ముత్తయ్య, ఎంపీడీఓ శ్రీనివాస్, రైతుబంధు మండల అధ్యక్షుడు అత్తె చంద్రమౌళి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు నూనె కుమార్ తదితరులు ఉన్నారు.

రామగుండం ప్రజలు తెలంగాణ వారు కాదా..!

- ఇక్కడి నిధులు గజ్వేల్‌కు ఎత్తుకుపోతున్నారు
- 'బీపీఎల్' భూముల్లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మించాలి
- బూడిద, ఇసుక, ఉద్యోగాల దోపిడీ రాజ్యం నడుస్తోంది
- ఓపెన్‌కాస్ట్‌లకు వ్యతిరేకమంటూనే నగరం నడిబొడ్డున ఏర్పాటా..?
- పీపుల్స్ మార్చ్‌లో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ధ్వజం



పాదయాత్రలో ప్రజలకు నమస్కరిస్తున్న భట్టి విక్రమార్క, డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్



కల్లు రుచిచూస్తూ..

సాక్షి, పెద్దపల్లి: బొగ్గు ఖనిజ సంపద ఉన్న రామగుండం ప్రజలు తెలంగాణ వారు కాదా..? ఇక్కడ ఖర్చు చేయాల్సిన డీఎంఎఫ్‌టీ, సీఎస్సార్ నిధులు గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లకు ఎత్తుకెళ్లే హక్కు ఎవరిచ్చారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పీపుల్స్‌మార్చ్‌లో భాగంగా రామగుండం నియోజకవర్గంలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పాదయాత్ర చేపట్టారు. ముర్మూర్, గొల్లపల్లి, బ్రహ్మణపల్లి, ఆకేనపల్లి, తక్కెలపల్లి శివారు, పుట్నూర్, జయరాం, రచ్చపల్లి గ్రామాల్లో స్థానికులను కలుస్తూ.. వారి సమస్యలను వింటూ.. వారికి భరోసా కల్పిస్తూ ముందుకుసాగారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం వస్తే ఓపెన్‌కాస్ట్ మైనింగ్ ఉండవని ప్రకటించిన కేసీఆర్.. రామగుండం నగరం నడిబొడ్డున ఓపెన్‌కాస్ట్ తెరిచి చిన్నపాటి భూకంపాలకు కారణమయ్యారని మండిపడ్డారు. వాటిని రద్దు చేయించాలన్న సోయి స్థానిక ఎమ్మెల్యేకు లేకపోవడం విచారకరమన్నారు. ఎల్లంపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేయకుండా తొమ్మిదిన్నరేళ్లుగా ఈ ప్రభుత్వం గాడిదలను కాస్తోందా..? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తిచేసి అంతర్గాం, పాలకుర్తి ప్రాంతాలకు నీళ్లు ఇస్తామన్నారు. బీపీఎల్ కంపెనీ ఏర్పాటుకు 1200 ఎకరాలు భూసేకరణ చేసి దశాబ్దం అవుతున్నా.. ఇప్పటివరకు కంపెనీ ఏర్పాటు చేయకుండా ఏం చేస్తున్నారని విమర్శించారు. కంపెనీ ఏర్పాటు చేయకుంటే సేకరించిన భూములను రైతులకైనా ఇవ్వాలని, లేకుంటే రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కోసమైనా కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇసుక, బూడిద దందా చేసుకునేందుకు ప్రజలు ఎమ్మెల్యేలుగా గెలిపించలేదన్నారు. ఆర్‌ఎఫ్‌సీఎల్ కాంట్రాక్టు లేబర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని ఎమ్మెల్యే డబ్బులు వసూలు చేయడం సిగ్గు చేటు అని పేర్కొన్నారు. ఉద్యోగాలు రాక.. వసూలు చేసిన డబ్బులు తిరిగి బాధితులకు ఇవ్వకపోవడంతో బాధితుల ఆత్మహత్యలకు కారణమైన ఎమ్మెల్యే ఈ రామగుండానికి అవసరమా..? అని ప్రశ్నించారు. ఇక్కడున్న ఎమ్మెల్యే దోచుకుని దాచుకోవడమే తప్ప ప్రజలకు చేసిందేమీలేదని, ఇక్కడి నదిజలాలను హైదరాబాద్‌కు తరలిస్తున్నా ఇక్కడి ప్రజల తరఫున ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. తలాపునే గోదావరి పారుతున్నా ఇక్కడి రైతులకు సాగునీరు.. ప్రజలు తాగడానికి చుక్కనీరు అందించని చరిత్ర బీఆర్‌ఎస్ పార్టీదేనని విమర్శించారు.

బీపీఎల్ భూములు తిరిగి ఇవ్వాలి

డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ మాట్లాడుతూ.. సాగు చేసుకుని జీవనం పొందే అన్నదాతలు తమ భూములను త్యాగం చేస్తే నేడు వారికి మిగిలింది శూన్యమేనని, కనీసం వారికి అందే పరిహారం కోసం కాళ్లరిగేలా తొమ్మిదేళ్లుగా తిరుగుతున్నా ఇచ్చిన పాపన పోవడంలేదన్నారు. సూపర్ క్రిటికల్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటుపై పాలకులకు సోయిలేదన్నారు. సేకరించిన బీపీఎల్ భూములను రైతులకు తిరిగి ఇవ్వాలన్నారు. నిరుపేదలు వేలాదిగా ఇళ్లు లేక కిరాయి ఇళ్లల్లో నివాసం ఉంటుంటే డబుల్ బెడ్‌రూమ్ పేరుతో ఏదో నామమాత్రంగా వారి కార్యకర్తలకే కేటాయించారని విమర్శించారు.

నేడు పెద్దపల్లికి చేరుకోనున్న భట్టి యాత్ర

పెద్దపల్లిరూరల్: సీఎల్పీ నేత భట్టివిక్రమార్క చేపట్టిన పీపుల్స్‌మార్చ్ మంగళవారం పెద్దపల్లి మండలం పాలితం గ్రామానికి చేరనుంది. రాత్రి ఏడు గంటలకు జిల్లాకేంద్రంలోని జెండాచౌరస్తాలో కార్నర్ మీటింగ్ ఉంటుందని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు తెలిపారు.

నాటుకోడి, జొన్నరొట్టె, దాల్‌ఫ్రై

- 'భట్టి' కోసం ప్రత్యేక వంటకాలు



కట్టెలపొయ్యిపై వండుతున్న రంగారెడ్డి

గోదావరిఖని: సీఎల్పీ నేత భట్టివిక్రమార్క కోసం ప్రత్యేక వంటకాలు చేస్తున్నారు. ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకోవడానికి ఆయన చేపట్టిన పాదయాత్ర రోజుకో గ్రామం మారుతుండడంతో తన ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. తన సొంత ప్రాంతం మధిర నుంచి వచ్చిన తన పీఏ ఐలోరి రంగారెడ్డి ప్రత్యేక వంటకాలు తయారు చేస్తున్నారు. ఉదయం డ్రైఫ్రూట్, మధ్యాహ్నం గోధుమ రొట్టె చపాతితో నాటుకోడి లేదా ఎగ్‌ఫ్రై, రాత్రి జొన్న రొట్టె, దాల్‌ఫ్రై అందిస్తున్నారు. పాదయాత్రకు ఎలాంటి ఆటంకమూ కలగకుండా ఆయన ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ప్రజావాణి సమస్యలకు పరిష్కారం చూపాలి



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

పెద్దపల్లిరూరల్: ప్రజావాణిలో అందిన ఫిర్యాదులకు ప్రాధాన్యతనిచ్చి సత్వరమే పరిష్కారం చూపాలని కలెక్టర్ సంగీత సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 39 దరఖాస్తులు స్వీకరించారు. ఇందులో 25 రెవెన్యూ సంబంధమైనవేనని, 14 ఇతర సమస్యలకు సంబంధించినవని కలెక్టర్ పేర్కొన్నారు. తమకు దళితబంధు పథకం వర్తింపజేయాలని, డబుల్‌బెడ్‌రూం, ఇంటిస్థలాల పంపిణీ చేయాలంటూ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ నాయకులు వినతిపత్రం అందించారు. పెద్దపల్లి మండలం గట్టుసింగారం గ్రామానికి చెందిన గుర్రాల భీమయ్య గ్రామశివారులోని ప్రభుత్వం కేటాయించిన భూమికి పట్టా ఇప్పించాలని కోరారు. తనకున్న స్థలంలో ఇంటిని నిర్మించుకునేందుకు ఆర్థికసాయం అందించాలని సుల్తానాబాద్ మండలం పెర్కపల్లికి చెందిన పంగ నర్సయ్య కోరారు. తమకు వారసత్వంగా వస్తున్న భూమిని కొందరు అక్రమంగా పట్టా చేసుకున్నారని, ఈ వ్యవహారంపై విచారణ జరిపి తమకు పట్టా అందించాలని ఎలిగేడు మండలం ముప్పిరితోటకు చెందిన కోట మల్లయ్య, భూమయ్య కోరారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



'అలవెన్స్'పైనే ప్రధాన చర్చ..!

- ఈనెల 18, 19న కోల్‌కత్తాలో జేబీసీసీఐ సమావేశం
- కనీస వేతనాలపై 19శాతం పెంపునకు కుదిరిన ఒప్పందం
- అలవెన్సులు, క్యాడర్ స్కీం, పింఛన్‌పైనే ప్రధాన చర్చ
- హాజరు కానున్న ఐదు జాతీయ సంఘాలు
- మొదటిసారి చర్చల్లో పాల్గొంటున్న ఐఎన్‌టీయూసీ

గోదావరిఖని: సింగరేణి బొగ్గు కార్మిక వర్గం వేతనాలతోపాటు ఆర్థికంగా కలిసివచ్చే అలవెన్స్‌లపై 22 నెలలుగా ఎదురుచూస్తోంది. ఈ అంశంపై ఇప్పటికే అటు యాజమాన్యం.. ఇటు కార్మిక సంఘాలు ఎనిమిది సార్లు సమావేశమైనా.. కేవలం మూల వేతనంపైనే ఒప్పందం కుదుర్చుకున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 4.80 లక్షల మంది కార్మికుల జీతభత్యాలతో ముడిపడి ఉన్న 11వ వేజ్‌బోర్డు 9వ సమావేశం ఈనెల 18, 19తేదీల్లో కోల్‌కత్తాలో నిర్వహిస్తున్నారు. ఎనిమిది సార్లు చర్చలు జరిపి చివరకు మూలవేతనంపై 19శాతం పెంచుతూ జనవరిలో కోలిండియా యాజమాన్యం అంగీకరించింది. ఈమేరకు అన్ని యూనియన్లు ఒప్పందం చేసుకున్నాయి. ప్రస్తుతం నిర్వహిస్తున్న జేబీసీసీఐ (జాయింట్ బైపార్టీ కమిటీ కోల్ ఇండస్ట్రీ) 9వ సమావేశంలో అలవెన్సులు, లీవులు, ఎల్‌టీసీ, ఎల్‌టీసీ, క్యాడర్‌స్కీం, రిటైర్మెంట్ బెనిఫిట్‌లు, రిటైర్మెంట్ పింఛన్, సీఎంఆర్‌ఎంఎస్ తదితర అంశాలపై జాతీయ కార్మిక సంఘాలు చర్చించనున్నాయి.

మొదటిసారిగా హాజరుకానున్న ఐఎన్‌టీయూసీ

అంతర్గత విభేదాలతో ఐఎన్‌టీయూసీ యూనియన్ నాయకులు కోర్టుకు వెళ్లడంతో జేబీసీసీఐ సమావేశాలకు ఆ యూనియన్‌ను కోలిండియా యాజమాన్యం ఆహ్వానించలేదు. దీంతో గత సమావేశాల్లో ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొనలేదు. ఇటీవల యూనియన్ అగ్రనాయకత్వం జోక్యంతో సయోధ్య కుదరడంతో జేబీసీసీఐ నుంచి ఐఎన్‌టీయూసీ వేజ్‌బోర్డు సభ్యులకు ఆహ్వానం అందింది. దీంతో ఐఎన్‌టీయూసీ మొదటిసారిగా పాల్గొననుంది. సింగరేణి తరఫున వేజ్‌బోర్డు సభ్యులు జనక్‌ప్రసాద్ పాల్గొననున్నారు. గత సమావేశాల వరకు నాలుగు జాతీయ సంఘాలు పాల్గొనగా, ప్రస్తుత సమావేశంలో ఐఎన్‌టీయూసీతో ఐదు సంఘాలు హాజరుకానున్నాయి. ఈనేపథ్యంలో సమావేశం వాడీవేడిగా జరిగే అవకాశం ఉంది.

ఇప్పటికే 22నెలలు ఆలస్యం..

దేశవ్యాప్త బొగ్గుగని కార్మికుల 11వేతన ఒప్పందం 22నెలలు ఆలస్యమైంది. 2021 జూలై 01తో పదోవేతన ఒప్పందం గడువు ముగిసింది. ఇప్పటికి 8సార్లు జేబీసీసీఐ సమావేశాలు నిర్వహించారు. చివరగా ఈఏడాది జనవరి 3న జరిగిన జేబీసీసీఐ సమావేశంలో కనీస వేతనంపై 19శాతం పెంచుతూ అంగీకారం కుదిరింది. మిగితా అలవెన్స్‌లపై అన్ని యూనియన్లతో యాజమాన్యం చర్చించాల్సి ఉంది. రెండు రోజుల పాటు జరిగే చర్చల్లో అలవెన్స్‌లపై ఒక ఒప్పందం ఖరారయ్యే అవకాశం తక్కువే అని చెప్పవచ్చు. అధికారుల సంఘం నాయకుల లేఖతో కోలిండియా యాజమాన్యం అలవెన్స్‌ల పెంపుపై తిరకాసు పెడుతోందని కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అధికారుల కన్నా ఉద్యోగుల వేతనాలు ఎక్కువ వచ్చే అవకాశం ఉండటంతో తమకు గౌరవం తగ్గిపోతుందని అధికారుల సంఘం నాయకులు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

జాప్యంతో కార్మికులకు నష్టం

వేజ్‌బోర్డు ఒప్పందం జాప్యం పెరిగిన కొద్ది ఆర్థికంగా నష్టం జరిగే అవకాశాలున్నాయి. వాస్తవానికి రెండేళ్ల కిందటే ఒప్పందం జరిగి ఉంటే అప్పటి నుంచే అలవెన్స్‌లు కార్మికులకు అందే అవకాశం ఉంది. అయితే వేతన ఒప్పందం పెరుగుదల ఏరియర్స్ యాజమాన్యం చెల్లిస్తున్నప్పటికీ అలవెన్స్‌లపై ఏరియర్స్ చెల్లించే అవకాశం లేకపోవడంతో కార్మికులు కనీసం రెండేళ్లపాటు నష్టపోయే అవకాశం ఉంది.

అలవెన్స్‌లు పెంచకుంటే ఆందోళన



బొగ్గు గని కార్మికుల మూలవేతనంలో 19శాతం పెరుగుదల ఉన్నప్పటికీ అలవెన్స్‌ల పెంపుదల కీలకం. అలవెన్స్‌ల పెంపు ఆలస్యం చేస్తే దేశవ్యాప్తంగా యూనియన్లకు అతీతంగా సంఘటితమై ఆందోళనలకు శ్రీకారం చుడతాం. ఈ విషయంలో వెనక్కి తగ్గేది లేదు.
– వాసిరెడ్డి సీతారామయ్య, వేజ్‌బోర్డు సభ్యుడు, ఏఐటీయూసీ

సమస్యలపై చర్చిస్తాం



బొగ్గు గనికార్మికుల వేజ్‌బోర్డు సమావేశానికి మొదటిసారిగా హాజరవుతున్నాం. కార్మికుల అన్ని సమస్యలపై కోలిండియా యాజమాన్యంతో చర్చిస్తాం. అలవెన్స్‌ల విషయంలో రాజీలేదు. అవసరమైతే కార్మికుల కోసం అన్ని యూనియన్లతో కలిసి ఉద్యమానికి సిద్ధమవుతాం. – జనక్‌ప్రసాద్, వేజ్‌బోర్డు సభ్యుడు, ఐఎన్‌టీయూసీ

జాప్యంతో నష్టం



వేతన ఒప్పందం జాప్యంతో కార్మికులకు నష్టం కానుంది. ఇప్పటికే రెండేళ్లు వేజ్‌బోర్డు ఆలస్యమైంది. పెరిగిన వేతనాల ఏరియర్స్ వస్తున్నా.. అలవెన్స్‌ల విషయంలో ఆర్థికంగా నష్టపోనున్నారు. కోలిండియా యాజమాన్యం స్పందించి వెంటనే ఒప్పందం ఖరారు చేయాలి. – మంద నర్సింహారావు, వేజ్‌బోర్డు సభ్యుడు, సీఐటీయూ

క్లీన్‌అండ్‌గ్రీన్‌లో సుల్తానాపూర్‌కు మూడోస్థానం



కేంద్రమంత్రి చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు

- ఢిల్లీలో జాతీయ పంచాయతీ అవార్డు అందుకున్న సర్పంచ్

ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామ పంచాయతీ ప్రతిష్టాత్మకమైన జాతీయ అవార్డు అందుకుంది. సోమవారం న్యూఢిల్లీలోని విజ్ఞానభవన్‌లో జాతీయ పంచాయతీ అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో సుల్తాన్‌పూర్ పంచాయతీ క్లీన్ అండ్‌గ్రీన్ విభాగంలో జాతీయస్థాయిలో మూడో స్థానంలో నిలిచింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్ చేతుల మీదుగా సర్పంచ్ అర్శనపల్లి వెంకటేశ్వర్‌రావు, పంచాయతీ కార్యదర్శి వినోద్‌కృష్ణ అవార్డుతోపాటు షీల్డ్, ప్రశంసాపత్రం, రూ.50 లక్షల నగదు అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, కమిషనర్ హన్మంతరావు, డిప్యూటీ కమిషనర్లు, స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్, డీపీవో చంద్రమౌళి, ఎంపీవో వెన్నంపురెడ్డి అనిల్‌రెడ్డి, ఎస్పీఎం రాజయ్య పాల్గొన్నారు. సుల్తాన్‌పూర్‌కు అవార్డు రావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

బీజేపీతోనే పేదలకు భరోసా



మాట్లాడుతున్న ప్రదీప్‌కుమార్

పెద్దపల్లిరూరల్: బీజేపీతోనే పేదలకు మేలు జరుగుతుందని, నూతన జాతీయ విద్యా విధానానికి బాటలు వేసిన ఘనత ప్రధాని మోదీదని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లోనూ మోదీ సారథ్యాన్ని దేశమొత్తం కోరుకుంటోందని పేర్కొన్నారు. ఇందుకు కార్యకర్తలు బూత్‌స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు. బూత్‌కమిటీలు భాగస్వామ్యమై సశక్తీకరణ్ అభియాన్ ఉద్యమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు దాడి సంతోష్, తంగెడ రాజేశ్వర్‌రావు, ప్రదీప్, సంపత్‌రావు, శ్రీనివాస్, మహేశ్, దిలీప్, శ్రీకాంత్, సతీశ్, నాగరాజు, కిరణ్, కోదాటి రమణారావు, అంజి, మధు ఉన్నారు.

మంథని @ 45 డిగ్రీలు

- రాష్ట్రంలోనే అత్యధికం
- భానుడి భగ భగ

సాక్షి, పెద్దపల్లి/మంథని: జిల్లాలో భానుడు భగభగలతో సెగలు కక్కాడు. సోమవారం రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు ఇక్కడ నమోదయ్యాయి. 39.4 డిగ్రీల నుంచి ఏకంగా 45 డిగ్రీలకు చేరింది. చాలాప్రాంతాల్లో 40 డిగ్రీలు దాటింది. రానున్న మూడు రోజులు ఎండలు మరింత మండుతాయని వాతావరణ శాఖ సూచించింది. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న మండలాలకు వాతావరణశాఖ రెడ్, ఆరెంజ్ జోన్‌లో చేర్చింది. అత్యధికంగా మంథనిలో 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదుకాగా.. ముత్తారంలో 43.8 డిగ్రీలు, అత్యల్పంగా భోజన్నపేట, రంగంపల్లి, సుగ్లాంపల్లిలో 39.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండలు మండుతుండటంతో కూలర్లు, ఫ్యాన్లు, ఏసీలతో కరెంటు వినియోగం భారీగా పెరిగింది.

సోమవారం జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతలు డిగ్రీల్లో..

మంథని	45.0	ధర్మారం	41.5
ముత్తారం	43.8	కునారం	41.5
కమాన్‌పూర్	42.4	అకినేపల్లి	41.4
కాల్వచర్ల	42.1	కనుకుల	41.4
పాలకుర్తి	41.9	పాలితం	41.2
మల్యాలపల్లి	41.9	కాల్వశ్రీరాంపూర్	41.2
రామగుండం	41.7	ఎలిగేడు	41.0
ఓదెల	41.5	ఎక్లాస్‌పూర్	40.8

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై ఉపేందర్‌రావు వివరాల ప్రకారం.. సుల్తానాబాద్ మండలంలోని చిన్నకల్వలకు చెందిన అడిచర్ల లక్ష్మయ్య (55), గొరవెళ్లి రామారావులు సోమవారం రాత్రి గ్రామ శివారులోని రాజీవ్ రహదారి పక్కనున్న వెల్డింగ్ షాపు వద్ద ఉన్నారు. ఆ సమయంలో గోదావరిఖని నుంచి కరీంనగర్ వెళ్తున్న కారు వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా లక్ష్మయ్య మార్గమధ్యలో మృతిచెందాడు. కారులో ఉన్నవారికి కూడా గాయాలవడంతో ఆసుపత్రికి తరలించామని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై పేర్కొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి ..


రవి మృతదేహం

శంకరపట్నం(మానకొండూర్): అంబాల్‌పూర్ గ్రామానికి చెందిన గొల్లెన రవి(40) అనుమానాస్పదస్థితిలో మృతిచెందినట్లు కేశవపట్నం ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రవి అంబాల్‌పూర్‌కే చెందిన స్వప్నను 2005లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. రవి ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో రెండేళ్లుగా స్వప్న తన పుట్టింటికి వెళ్తోంది. ఈ నెల 9న ఎల్లమ్మ బోనాల జాతరకు ఆమె మేనమామ దామోదర్ వచ్చి స్వప్న, రవితో పాటు పిల్లలను తీసుకెళ్లాడు. 16న రవి అనారోగ్యానికి గురవగా మానకొండూర్ మండలంలోని గట్టుదుద్దెనపల్లి ఆర్ఎంపీ వైద్యుని వద్దకు వెళ్లారు. సోమవారం తెల్లవారుజామున కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తుండగా అతను మృతిచెందాడు. తన కుమారుడి మృతిపై అనుమానం ఉందని మృతుడి తండ్రి కొంరయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చెట్టును ఢీకొన్న వ్యాన్

- డ్రైవర్ మృతి, మరొకరికి తీవ్రగాయాలు

సత్తుపల్లి టౌన్: ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించబోయి డీసీఎం వ్యాన్ చెట్టును ఢీకొనడంతో డ్రైవర్ మృతిచెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. సత్తుపల్లి శివారులో సోమవారం చోటు చేసుకున్న సంఘటనా వివరాలిలా ఉన్నాయి. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం చెప్యాలకు చెందిన ఈడపల్లి నరేశ్ (32) తన స్నేహితుడు చిర్రా నరేశ్‌తో కలిసి అనకాపల్లికి వెళ్లాడు. అక్కడి నుంచి కరీంనగర్‌కు సెంట్రింగ్ కర్ర లోడ్‌తో డీసీఎంలో ఆదివారం రాత్రి బయలుదేరాడు. సోమవారం తెల్లవారుజామున సత్తుపల్లి మండలం తాళ్లమడ పెద్దవంతెన సమీపంలో డ్రైవర్ మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో డ్రైవర్ ఈడపల్లి నరేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య సౌజన్య ఉన్నారు. పోస్టుమార్టం పోస్టుమార్టం నిమిత్తం బంధువులకు అప్పగించారు. ఈ ప్రమాదంలో గాయపడిన తనను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారని వ్యాన్ డ్రైవర్ స్నేహితుడు చిర్రా నరేశ్ తెలిపారు. సత్తుపల్లి ఎస్సై బాణాల రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

లారీ డ్రైవర్‌పై కేసు

జగిత్యాల క్రైం : జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ వద్ద జగిత్యాల–నిజామాబాద్ ప్రధాన రహదారిపై ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రాంచందర్‌రావు తెలిపారు. గాంధీనగర్‌కు చెందిన నక్క రాజేశ్ ఈనెల 14న రాత్రి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా నిజామాబాద్ జిల్లాకు చెందిన దరావత్ అనిల్ అజాగ్రత్తతో లారీతో రాజేశ్‌ను ఢీకొట్టాడు. బాధితుడి భార్య జమున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాలు

- ఈ నెల 25లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- గతంలో రానివారూ చేసుకోవచ్చు


ఇటీవల పంపిణీ చేసిన ట్రై సైకిళ్లతో దివ్యాంగులు

సుల్తానాబాద్(పెద్దపల్లి): రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రత్యేక చొరవ తీసుకుంటోంది. ఇటీవల ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. ఇప్పటికే దివ్యాంగులకు రూ.3,016 పెన్షన్ ఇవ్వడంతోపాటు జీవనోపాధి కోసం కిరాణం, జనరల్ స్టోర్ తదితర దుకాణాల ఏర్పాటుకు 80 శాతం సబ్సిడీతో రుణాలను అందించారు. తాజాగా జిల్లా వ్యాప్తంగా ఉపకరణాలు ఇవ్వడానికి సిద్ధమయ్యారు. పెద్దపల్లి జిల్లాలోని దివ్యాంగులు ఈ నెల 25లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి రవూఫ్‌ఖాన్ తెలిపారు

ఉచితంగా ఇచ్చేందుకు నిర్ణయం..

జిల్లాలో 14 మండలాలు, 266 గ్రామపంచాయతీలతోపాటు పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలు, రామగుండం కార్పొరేషన్ ఉన్నాయి. జిల్లాలోని దివ్యాంగుల సౌకర్యార్థం సాంకేతిక పరిజ్ఞానంతో ఆధునీకరించిన ఉపకరణాలను 2023–24 సంవత్సరానికి గాను ఉచితంగా పంపిణీ చేసేందుకు తెలంగాణ వికలాంగుల సహకార సంస్థ, హైదరాబాద్ వారి ద్వారా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దరఖాస్తులను జిల్లా ఎంపిక కమిటీ నియమ, నిబంధనల మేరకు పరిశీలించి, అర్హుల జాబితాను రాష్ట్ర కార్యాలయానికి పంపనున్నారు. తర్వాత వారికి ఉపకరణాలు ఉచితంగా పంపిణీ చేయనున్నారు.

పైరవీలకు తావు లేదు..



ఉపకరణాల కోసం దివ్యాంగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. సంబంధిత పత్రాలను మా కార్యాలయంలో అప్పగించాలి. ఇందులో ఎలాంటి పైరవీలకు తావు లేదు.

– రవూఫ్ ఖాన్, డీడబ్ల్యూవో, పెద్దపల్లి

ఉపకరణాలు ఇవీ..

దివ్యాంగుల ఉపకరణాల కింద జిల్లాలో 12 రెట్రో ఫిట్టెడ్ మోటార్ వెహికల్స్, 9 బ్యాటరీ వీల్ చైర్స్, 6 ల్యాప్‌టాప్స్, 15 స్మార్ట్ ఫోన్లు, 1 డీసీ ప్లేయర్, 22 ట్రై సైకిళ్లు, 3 వీల్‌చైర్లు, 42 చంకకర్రలు, 15 వినికిడి యంత్రాలు, 17 అంధుల చేతి కర్రలు, 4 అంధుల స్మార్ట్ కెన్ డివైసెస్, 9 టీఎల్ఎం కిట్లు ఇవ్వనున్నారు.

తహసీల్దార్ ధ్రువీకరణ తప్పనిసరి..

దరఖాస్తు చేసుకునేవారి ఆదాయ పరిమితి గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలు ఉండాలి. తహసీల్దార్ ధ్రువీకరించిన ఆదాయ సర్టిఫికెట్ జత చేయాలి. గతంలో దరఖాస్తు చేసుకున్నవారికి ఉపకరణాలు రాకపోతే మళ్లీ చేసుకోవాలి. www.tsobmms.cgg.gov.in పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకొని, జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో అందించాలి. ఇతర వివరాలకు జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో పనివేళల్లో నేరుగా సంప్రదించాలి.

బాలుడిని బలిగొన్న కారు..

- పాఠశాల నుంచి వస్తుండగా ఘటన
- తండ్రి, ఇద్దరు పిల్లలకు గాయాలు
- రాంగ్ రూట్‌లో వచ్చి ఢీకొట్టిన కారు
- తండ్రి కళ్లెదుటే ఓ కొడుకు కన్నుమూత
- గుండలవిసేలా రోదించిన దివ్యాంగుడు
- బాధితులది హుజూరాబాద్ మండలం జీలుగుల గ్రామం


మనుక్షిత్ మృతదేహం


గాయపడిన శ్రీనివాస్, సాయికీర్తన్

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): ఆయన దివ్యాంగుడు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు కూడా. తన ఇద్దరు పిల్లలను తాను పనిచేస్తున్న పాఠశాలలోనే చేర్పించి ప్రతిరోజూ తన పిల్లలను తన మూడు చక్రాల బండిపై తీసుకెళ్తూ.. తీసుకొస్తుంటాడు. ఎప్పటిలాగే తన ఇద్దరు కుమారులతో బడికి వెళ్లాడు. సాయంత్రం విధులు ముగించుకుని తన పిల్లలను బండిపై ఎక్కించుకుని ఇంటికి తిరుగు ప్రయాణమయ్యాడు. ఇంతలో విధి వక్రీకరించింది. వేగంగా దూసుకొచ్చిన కారు వీరి వాహనాన్ని బలంగా ఢీకొంది. ఈ ఘటనలో ముగ్గురూ కింద పడిపోయారు. తేరుకునేలోపే ఓ కుమారుడు రక్తపు మడుగులో కొట్టుకుని కన్నుమూశాడు. తండ్రితోపాటు మరో కుమారుడు కూడా తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన కాల్వశ్రీరాంపూర్ మండలంలో చోటుచేసుకుంది. హుజూరాబాద్ మండలం జీలుగుల గ్రామానికి చెందిన ఆరెపెల్లి శ్రీనివాస్ దివ్యాంగుడు. కాల్వశ్రీరాంపూర్ మండలం మంగపేట పంచాయతీ పరిధి తెనుగుపల్లె ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. కాల్వశ్రీరాంపూర్ మండలకేంద్రంలోనే కుటుంబంతో కలిసి ఉంటున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు మనుక్షిత్ (రెండో తరగతి), సాయికీర్తన్ (ఒకటో తరగతి) అదే బడిలో చదువుతున్నారు. రోజూ మాదిరిగానే సోమవారం పాఠశాలకు త్రిచక్రవాహనంపై వెళ్లి వస్తున్నారు. కాల్వశ్రీరాంపూర్–గంగారం గ్రామాల మధ్య వీరి వాహనాన్ని హనుమకొండ నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న కారు బలంగా ఢీకొంది. ఈ ఘటనలో మనుక్షిత్ అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీనివాస్, సాయికీర్తన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కాల్వశ్రీరాంపూర్ ఎస్సై రాజవర్ధన్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. గాయపడిన తండ్రీకొడుకులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో కరీంనగర్ తీసుకెళ్లారు. మనుక్షిత్ మృతదేహాన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. ఎంపీపీ నూనేటి సంపత్, జెడ్పీటీసీ సభ్యుడు వంగళ తిరుపతి రెడ్డి, ఎంఈవో ఆరెపల్లి రాజయ్య బాధితులను పరామర్శించారు.

ఖాళీ స్థలమా.. బూడిదతో నింపుడే

- వందల ట్రిప్పులు నిల్వ చేసిన అక్రమార్కులు
- విపరీతమైన దుమ్ముతో వాహనదారులు, స్థానికుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు


బోడగుట్ట క్రషర్ల సమీపంలో బూడిద కుప్పలు

పాలకుర్తి(రామగుండం): బూడిద అక్రమార్కులకు బంగారంలా మారింది. ఎన్టీపీసీ యాష్‌పాండ్ నుంచి కొందరు బూడిదను తరలించి, పాలకుర్తి మండల పరిధిలో నిల్వచేసి, సొమ్ము చేసుకుంటున్నారు. స్థానిక ధర్మారం క్రాస్‌రోడ్డు సమీపంలో ఫోర్‌లైన్ రహదారితోపాటు మండల ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న బోడగుట్ట క్రషర్ల సమీపంలోని అసైన్డ్ భూమి, ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లో వందలాది ట్రిప్పుల బూడిద నిల్వ చేశారు. ఎన్టీపీసీ బూడిద రవాణాకు నిర్వహించిన టెండర్ గడువు గత నెలలో ముగిసింది. ఈ నేపథ్యంలో అక్రమార్కులు నూతన టెండర్లు వస్తే పరిస్థితి ఎలా ఉంటుందోనని, ముందుచూపుతో ఎన్టీపీసీ యాష్‌పాండ్ నుంచి బుగ్గ మీదుగా అందుగులపల్లి వరకు ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడ బూడిద డంపు చేసి, పెట్టుకున్నారు. దాన్ని ఇతర ప్రాంతాల్లోని ఇటుకబట్టీలకు, ఇతర వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. అయితే బూడిదను లారీల్లో లోడింగ్ చేసే సమయంలో విపరీతంగా దుమ్ము లేస్తోంది. గాలులు వీస్తే రోడ్డును కమ్మేస్తుండటంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవానికి స్థానికంగా బూడిద వ్యాపారం చేసేవారికి పంచాయతీ, రెవెన్యూ అధికారుల అనుమతి ఉండాలి. కానీ ఇక్కడ అదేమీ లేదు. నియోజకవర్గ ముఖ్య ప్రజాప్రతినిధి అనుచరులైనందునే అధికారులు చర్యలు తీసుకునేందుకు జంకుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ విషయమై పాలకుర్తి తహసీల్దార్ సునీతను వివరణ కోరగా బూడిద నిలువల ఎవరూ అనుమతి తీసుకోలేదని తెలిపారు. ధర్మారం క్రాస్‌రోడ్డు ప్రాంతంలో బూడిద నిల్వలను తాము కూడా గమనించామని, తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



మండుటెండల్లో ‘ఉపాధి’ పనులు

ఎలిగేడు(పెద్దపల్లి): మండలంలోని ధూళికట్ట గ్రామంలో మండుటెండలను లెక్క చేయకుండా కూలీలు పనులకు వచ్చి, నిర్ణీత సమయంలోగా పూర్తి చేసుకుంటున్నారు. సోమవారం 80 మంది హాజరై, ధూళికట్ట ఎల్లమ్మ ఆలయం నుంచి ఎస్సారెస్పీ చీమలపేట కెనాల్‌లో పూడికతీత పనులు చేపట్టారు. సర్పంచ్ గొల్లె కావేరి అక్కడికి వెళ్లి, కూలీలతో మాట్లాడారు. వారికి కల్పిస్తున్న వసతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సేంద్రియ కూరగాయలతో ఆరోగ్యానికి మేలు


మాట్లాడుతున్న జీఎం వెంకటేశ్వర్‌రావు

కమాన్‌పూర్(మంథని): సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని ఆర్జీ–3 జీఎం తన్నీరు వెంకటేశ్వర్‌రావు అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ క్యాంపు శిక్షణలో భాగంగా సోమవారం సెంటనరీకాలనీలోని ఆఫీసర్ క్లబ్‌లో పెరటి, మిద్దెతోటల సేంద్రియ సాగు విధానంపై జూలపల్లి, పన్నూర్, నాగేపల్లి, ముల్కలపల్లి, రత్నాపూర్ గ్రామ ప్రజలకు మిద్దె తోటల నిపుణులు రఘోత్తంరెడ్డితో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. గతంలో పెరడు లేని ఇల్లు లేదని, మార్కెట్లోకి అనేక రకాల కూరగాయలు వస్తున్న నేపథ్యంలో పెరటి తోటలు కనుమరుగైపోయాయని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లో లభించే కూరగాయలు, ఆకుకూరలను క్రిమిసంహారక మందులు వాడి పండిస్తున్నారని అన్నారు. వాటిని తింటే కేన్సర్ వంటి జబ్బులు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ.. రెండు దోసిళ్ల మట్టి, దోసెడు ఎరువు ఉంటే ఎక్కడైనా పెరటితోటలు పెంచుకోవచ్చని తెలిపారు. వీటితో ఎలాంటి క్రిమిసంహారక మందులు లేని కూరగాయలతోపాటు పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు గౌతం శంకరయ్య, నరేందర్, సేవా అధ్యక్షురాలు శ్రీదేవి, సర్పంచ్ అల్లం పద్మ, సింగరేణి అధికారులు రఘుపతి, షఫీ, రమేశ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లస్థలాలు ఇవ్వాలి


ప్రభుత్వ భూమిలో జెండాలు పాతుతున్న పేదలు



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

జ్యోతినగర్: అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఎం ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ కార్యదర్శి గీట్ల ముకుందరెడ్డి అన్నారు. సోమవారం రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ జంగాలపల్లె శివారు ప్రభుత్వ భూమిలో నాలుగో భూపోరాట కేంద్రంగా గుర్తించి జెండాలు పాతారు. రాష్ట్రం ఏర్పడిన అనంతరం నిరుపేదలు ఇంటిస్థలం కోసం ఎంతగానో ఎదురుచూస్తున్నారని అన్నారు. ప్రభుత్వ భూమిని పేదలకు ఇవ్వకుంటే సీపీఎం ఆధ్వర్యంలో పేదలు స్వాధీనం చేసుకుంటారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వేల్పుల కుమారస్వామి, రెండో డివిజన్ కార్యదర్శి గీట్ల లక్ష్మారెడ్డి, నాయకురాళ్లు నాగమణి, లావణ్య, ఫైముదా, సమ్మక్కతో పాటు సంజీవ్, మహమ్మద్, సురేష్, శివకుమార్, కృష్ణ, శ్రీనివాస్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంలో పండుగలకు పెద్దపీట


ఇఫ్తార్ విందులో జెడ్పీ చైర్మన్ మధు

కమాన్‌పూర్(మంథని): బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజల పండుగలకు పెద్దపీట వేస్తున్నారని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకొని కమాన్‌పూర్ మండల కేంద్రంలోని మసీదులో ముస్లింలకు ప్రభుత్వం సోమవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. చైర్మన్ వెంట తహసీల్దార్ దత్తు ప్రసాదరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులున్నారు.


ఇఫ్తార్ విందులో ప్రొఫెసర్లు, మెడికోలు

మెడికల్ కాలేజీలో...

కోల్‌సిటీ(రామగుండం): రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని రామగుండం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సోమవారం సాయంత్రం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నరేందర్, ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, హెచ్‌వోడీలు, కార్యాలయ అధికారులు నిదవుల్లా, సాద్, అనిల్ రాహుల్, రట్నేశ్, రేణుక, శ్రీదేవి, ఫయాజుద్దీన్, ఇమాముద్దీన్, మెడికోలు హాజరయ్యారు.

పోలీసులకు నిజమైన పండుగ క్రీడలే..

- రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి
- అట్టహాసంగా ప్రారంభమైన పోలీసుల క్రీడాపోటీలు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీపీ రెమా రాజేశ్వరి

గోదావరిఖని: పోలీసులకు నిజమైన పండుగ క్రీడలేనని రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి తెలిపారు. ప్రజలు పండుగ సమయంలో ఆనందంగా ఉంటే పోలీసులు మాత్రం భద్రతలో పాల్గొంటారని పేర్కొన్నారు. స్థానిక జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియంలో మూడురోజులపాటు జరిగే క్రీడాపోటీలను సోమవారం ఆమె ప్రారంభించారు. ఆరేళ్ల అనంతరం నిర్వహిస్తున్న ఈ పోటీలకు పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల డీసీపీలు ఏర్పాట్లు చేయడం ఆనందంగా ఉందన్నారు. పోలీసులు విధి నిర్వహణలో బిజీగా ఉంటూ ఆరోగ్యంపై దృష్టి పెట్టడం లేదని, అలాంటి వారికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. క్రీడాస్ఫూర్తితో ముందుకుసాగాలన్నారు. మంచిర్యాల జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్‌నాయక్ మాట్లాడుతూ పని ఒత్తిడి తట్టుకోవడానికి, నూతనోత్సాహాన్ని ఇవ్వడానికి క్రీడలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. క్రీడలతో సిబ్బంది, అధికారుల మధ్య సమన్వయం పెరిగి స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందన్నారు. ముందుగా బెలూన్లను ఎగురవేశారు. క్రీడాజ్యోతితో పరేడ్ చేశారు. క్రికెట్, షటిల్, బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, టగ్‌ఆఫ్‌వార్, హై జంప్, లాంగ్ జంప్, షాట్ పుట్, డిస్కస్ త్రో, జావలిన్, అథ్లెటిక్స్ పోటీలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో పెద్దపల్లి, మంచిర్యాల డీసీపీలు వైభవ్‌గైక్వాడ్, సుధీర్‌కేకన్‌రాంనాథ్, ఏసీపీలు గిరిప్రసాద్, నరేందర్, మహేశ్, తిరుపతిరెడ్డి, మోహన్, వెంకటేశ్వర్లు, ఉపేందర్, బాల్‌రాజ్, సుందర్‌రావు, మల్లికార్జున్, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.


టగ్‌ఆఫ్‌వార్‌లో ఉత్సాహంగా పాల్గొన్న పోలీసులు


కబడ్డీ ఆడుతూ..


పెద్దపల్లి జిల్లా జట్టు గెలవడంతో డీసీపీ వైభవ్‌గైక్వాడ్‌ను భుజాలపై ఎత్తుకుని కేరింతలు